పరిష్కారం కాని సమస్యలు

- ఏజెన్సీలో నిలిచిన రోడ్లు, భవనాల నిర్మాణాలు
- నేడు గిరిజన దర్బార్
- సమస్యలపై వినతులు అందజేయనున్న ప్రజలు

కొత్తగూడ: మండల కేంద్రంలో నేడు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. ఈమేరకు అధికారులు సన్నద్ధమయ్యారు. కాగా ఏజెన్సీలో చిన్నచిన్న సమస్యలు మిగతావి పరిష్కారం కావడం లేదని చర్చ జరుగుతోంది. ఏజెన్సీ పల్లెల్లో పేరుకుపోయిన సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలు అందజేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

నిధులు లేక మధ్యలో ఆగిపోయిన రోడ్లు..

కొత్తగూడ మండలంలోని పలు గ్రామాలకు సార్వత్రిక ఎన్నికల ముందు మంజూరు అయిన రోడ్ల పనులకు ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు కంకరపోసి వదిలేయడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందులో ఓటాయి నుంచి అంకన్నగూడెం, మొండ్రాయిగూడెం నుంచి ఎంచగూడెం, పొగుళ్లపల్లి నుంచి మోకాళ్లపల్లి, మోకాళ్లపల్లి నుంచి మొండ్రాయిగూడెం, పొగుళ్లపల్లి నుంచి నీలంపల్లి, గోవిందాపురం నుంచి పొగుళ్లపల్లి రోడ్లు నిధులు విడుదల కాక, అటవీశాఖ అనుమతులు రాక మధ్యలోనే నిలిచిపోయాయి. కాగా రోడ్ల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.


పనులు పూర్తి కాని అంకన్నగూడెం రోడ్డు

గురుకులంలో మధ్యలో నిలిచిన భవనం..

గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే స్లాబ్ వరకు పనులు చేపట్టి నిలిపివేశారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా మైనర్ రిపేర్లకు నిధులు రావడం లేదు. కాగా మన ఊరు–మన బడి పథకంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు అంటున్నారు. కాగా గిరిజన దర్బార్ ద్వారానైనా ఏజెన్సీలోని సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ



కురవి: సీరోలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం తొర్రూరు డీఎస్పీ కె.కృష్ణకిశోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మరిపెడ సీఐ, సీరోలు ఎస్సై నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి హాకీ ఎంపికలు

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో సీఎం కప్ క్రీడల్లో భాగంగా జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. ఈమేరకు క్రీడాకారులను ఎంపీడీఓ క్రాంతి పరిచయం చేసుకుని, క్రీడలను ప్రారంభించారు. మొత్తం జిల్లాస్థాయి హాకీ పోటీల్లో 60 మంది క్రీడాకారులు పాల్గొనగా, 18 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పీడీ కొమ్ము రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బందెల రాజు, పీఈటీ సుంకరి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో రైతు సమస్యలపై ప్రస్తావన

కేసముద్రం/గూడూరు: కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామ రైతుల భూసమస్యపై, మరోసారి అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ గురువారం ప్రస్తావించారు. అలాగే గూడూరు మండలంలోని సీతానగరం, మట్టెవాడ, శివారు నేలవంచ, కొంగరగిద్ద గ్రామాల రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. దీంతో రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కేజీబీవీ ఎస్‌ఓగా సోమలక్ష్మి



కేసముద్రం: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నూతన స్పెషల్ ఆఫీసర్‌గా సోమలక్ష్మి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఓ నీలిమ బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో సోమలక్ష్మిని నియమించారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

నెల్లికుదురు: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దబోయిన కృష్ణ (45) ఐదేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి కడుపు నొప్పి భరించలేక మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వర్గీకరణ అమలుకు చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య అన్నారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్, రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌కు హన్మకొండలో గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ రాధా, సుధారాణి, నాయకులు ఏలేందర్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

డోర్నకల్: విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం మధ్యాహ్న భోజనం కోసం వినియోగిస్తున్న బియ్యంతోపాటు సరుకులను తనిఖీ చేసి వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండి నరసింహారావు, నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాలు

గార్ల: వ్యవసాయ కార్యాలయంలో యాసంగి పంటకు రాయితీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు గురువారం తెలిపారు.

కొత్తగూడలో..

కొత్తగూడ: యాసంగి వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వ రాయితీలో వరివిత్తనాలు ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఉదయ్ తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో కొందరు రైతులకు విత్తనాలు అందజేశారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

- పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సోమయ్య

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్ నుంచి మంగళి కాలనీ వరకు డివైడర్‌లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి డీఈసీహెచ్ ఉపేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. నెహ్రూసెంటర్ నుంచి బాబునాయక్ తండా క్రాస్ రోడ్డు వరకే డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు భావ్యం కాదన్నారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారనే ఆ రోడ్డులోని మంగళికాలనీతోపాటు పలు కాలనీవాసులు అధికారులకు సహకరించారన్నారు. కార్యక్రమంలో అల్లి శ్రీనివాస్‌రెడ్డి, సమ్మెట రాజమౌళి, సైదులు, శ్రీనివాస్, రజాక్, లాలయ్య, వెంకన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.


ఉపేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

26న సీపీఐ వార్షికోత్సవం

- పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి

నెహ్రూసెంటర్: సీపీఐ 99వ వార్షికోత్సవం వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన 99సంవత్సరాల వార్షికోత్సవాలు, డిసెంబర్ 30వ తేదీన నల్లగొండలో జరిగే పార్టీ 100 సంవత్సరాల దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు కుమార్, నవీన్, వెంకన్న, పాండురంగాచారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయసారథి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


మరిపెడ రూరల్: స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సత్యనారాయణ

మరిపెడ రూరల్: మండలంలోని ఎల్లంపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థి, దాత కొండ సత్యనారాయణ తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఇటీవల లక్ష రూపాయలు విరాళం ప్రకటించాడు. 10వ తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశాడు. సత్యనారాయణను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు వెంకటేష్, వీరేందర్, ఐనాల నవీన్, రమేశ్, ప్రసాద్, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద బిడ్డల అభ్యున్నతికి పాటుపడాలని బొమ్మకల్లు హెచ్‌ఎం లీలా శోభారాణి అన్నారు. వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు గురువారం ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రాజగోపాల్, వేణుగోపాల్, భాస్కర్, ఉపాధ్యాయులు రవీందర్, రమేశ్‌బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కురవి: ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో జరిగే తెలంగాణ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ పిలుపునిచ్చారు. గురువారం కురవి ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైజ్ఞానిక మహాసభలలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ పరిస్థితులు, ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సమస్యలపై, వివిధ విద్యారంగ అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంజుల, లక్ష్మయ్య, సీహెచ్ ప్రదీప్, లక్ష్మణ్‌రావు, మాధవి, రవీందర్, యాకమ్మ, రాజు, రవీందర్ పాల్గొన్నారు.


మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెండింగ్‌లో విశ్రాంత ఉద్యోగుల డీఏలు


మాట్లాడుతున్న గుడి రాంప్రసాద్

గార్ల: విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు గుడి రాంప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గార్లలో నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షన్ అనేది యజమాని ఇష్టాఇష్టాలతో ఇచ్చే దానం కాదని, ఉద్యోగులకు చట్టబద్ధమైన హక్కు అన్నారు. డిసెంబర్ 17 పెన్షనర్లకు చారిత్రాత్మక దినం అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు హెల్త్‌కార్డులకు ఇవ్వాలని, కొత్త పీఆర్‌సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం చేశారు. సమావేశంలో ఎంఈఓ వీరభద్రం, గట్టు అనంతరాములు, నర్సింహరావు, గద్దల సుశీల, వైహెచ్ ప్రసాద్, వజ్రం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు ప్రజాసంఘాల మద్దతు

కురవి: పంట రుణమాఫీ కోసం ఐక్యంగా పోరాటం చేస్తామని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. రైతులందరికీ రుణమాఫీ జరగాలని కోరుతూ మండల కేంద్రంలో రైతు బేతమళ్ల సహదేవ్ చేపట్టిన దీక్ష గురువారం ఐదోరోజుకు చేరుకుంది. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కిషన్ నాయక్, వికలాంగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ధరంసోత్ బాలు, నాయకులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పును వెనక్కి తీసుకోవాలి

నెల్లికుదురు: ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు వెనక్కి తీసుకోవాలని మాలమహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాల మహానాడు నాయకులను అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మహేష్, రాకేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

దత్తత పేరుతో పిల్లలను అమ్మడం నేరం

గూడూరు: దత్తత పేరుతో చిన్న పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మండల పరిషత్ ఉద్యోగులతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్: బాలికల సంరక్షణ, మహిళల భద్రతే షీటీం లక్ష్యమని షీటీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని అక్షర కాన్సెప్ట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బిజుపీటర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

చిన్నగూడూరు: గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 15గొర్రెలు మృత్యువాతపడిన ఘటన మండలంలోని ఉగ్గంపల్లిలో జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి చిత్తారి యాకన్న గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం అన్నం తినడానికి గొర్రెల మంద నుంచి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో వీధి కుక్కలు మూకుమ్మడిగా మందపై దాడి చేసి విచక్షణారహితంగా కొరికేశాయి. బాధితుడు వచ్చేసరికి కుక్కల దాడిలో 15గొర్రెలు మృత్యువాతపడ్డాయి. సుమారు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు బోరున విలపించాడు. తనను ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్నాడు.

ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

కురవి: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం కురవిలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి లంచ్ అవర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం నాయకులు బాబు, సునీత, రవి, మంగీలాల్, ధర్మ, బాలరాజు, శారద, గోవర్ధన్, శ్రీను, నాగమణి, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన


మహబూబాబాద్ అర్బన్: నిరసన తెలుపుతున్న నాయకులు


నెహ్రూసెంటర్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నెహ్రూసెంటర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ కిషన్‌నాయక్, కేవీపీఎస్ సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రామమూర్తి వేర్వేరు కార్యక్రమాల్లో డిమాండ్ చేశారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.

తొర్రూరు: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని అంబేద్కర్ వాదులు డిమాండ్ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీయువకులు, అన్నివర్గాల ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఉపేందర్ సూచించారు. గురువారం మండలంలోని గుర్తూరు గ్రామంలో తొర్రూరు పోలీస్‌శాఖ వారి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రస్థాయి పోటీ పరీక్షకు ఎంపిక

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌కు చెందిన డి. దేవేందర్ తెలంగాణ బయాలిజికల్ సైన్స్ ఫోరం జిల్లా శాఖ తరఫున నిర్వహించిన టెస్టులో ద్వితీయ స్థానం పొంది, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో విద్యార్థిని హెచ్‌ఎం సదాశివతోపాటు ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ, సన్మాన పత్రంతోపాటు వెయ్యి రూపాయల నగదు అందించారు.

ఎస్సారెస్పీ జలాలతో చెరువులను నింపాలి

డోర్నకల్: ఎస్సారెస్పీ జలాలతో గ్రామాల్లోని చెరువులు నింపాలని సీపీఎం నాయకుడు బోయినపల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని వెన్నారం గ్రామంలో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, కనకయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కురవి: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని నల్లెల్ల గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు అలువాల నరేష్, నవీన్ కాంగ్రెస్ చేరారు. వారిని ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో దువ్వ సైదులు, బండి మల్లయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇస్కాన్ సేవలు అభినందనీయం

మహబూబాబాద్ రూరల్: శాంతి, ప్రేమ, దైవత్వాన్ని బోధిస్తున్న ఇస్కాన్ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు అన్నారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులను కలిసి గురువారం భగవద్గీత గ్రంథం, ఆశీస్సులు స్వీకరించారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి

చిన్నగూడూరు: నేటి యువత అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు వల్లూరి కృష్ణారెడ్డి అన్నారు. సీఎం కప్ మండల స్థాయి క్రీడోత్సవాలలో భాగంగా వల్లూరి కృష్ణారెడ్డితో కలిసి మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు మండలంలోని క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు.

మంత్రికి వినతి

బయ్యారం: మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ప్రవీణ్‌నాయక్ ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

గార్ల: చలో అసెంబ్లీ కార్యక్రమంకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న గొర్రెలమేకల పెంపకందార్ల రాష్ట్ర నాయకుడు ఇమ్మడి గోవింద్‌ను గురువారం పోలీసులు అక్రమంగా ముందస్తు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాసరావు, హరినాయక్ పేర్కొన్నారు.

కల్వలలో సీపీఎం ఇంటింటి సర్వే

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో పలు సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మార్తనేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి తాడబోయిన లింగమ్మ, మోడెం వెంకటేశ్వర్లు, తాడబోయిన శ్రీశైలం, సావిత్ర పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

మహబూబాబాద్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు బార్ అసోసియేషన్ నాయకులు గురువారం సంఘీభావం తెలిపారు.

దివ్యాంగులు ధైర్యంగా ఉండాలి

మహబూబాబాద్: దివ్యాంగులు మనోధైర్యం కోల్పోకుండా ధైర్యంగా ఉండి ముందుకు పోవాలని మెప్మా డీఎంసీ విజయ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం మదర్ థెరిసా వికలాంగుల సమాఖ్య 9వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం దివ్యాంగులు విజయను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీదర్, దివ్యాంగులు ఉపేందర్, సుధాకర్, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

నెహ్రూసెంటర్: కేరళ వామపక్ష ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కేరళ సంఘీభావ సభ గురువారం నిర్వహించారు. సమావేశంలో ఆకుల రాజు, కుంట ఉపేందర్, అల్వాల వీరయ్య, గునిగంటి రాజన్న, కుమ్మరికుంట్ల నాగన్న, నల్లపు సుధాకర్ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

నెల్లికుదురు: మండలంలోని అమ్మ ప్రేమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో గురువారం సెమీ క్రిస్మస్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య తెలిపారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ జేపీ రత్నం, అశోక్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గార్ల: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 22న వరంగల్‌లో నిర్వహించే కాకతీయ కదనభేరి సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివ, శ్రీకాంత్, రవీందర్, దస్తగిరి, ప్రసాదరావు, ఇస్లావత్ చాంప్లానాయక్ పాల్గొన్నారు.

నేడు వెయిట్‌లిఫ్టింగ్ జట్ల ఎంపికలు

డోర్నకల్: సీఎం కప్ కోసం నేడు డోర్నకల్‌లో వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ సెక్రటరీ మండలోజు సుధాకర్ గురువారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, 10వ తరగతి మెమోతో రావాలని, పూర్తి వివరాలకు 78428 03586 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఇసుక రవాణా కట్టడికి కందకాలు

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ శివారు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేయకుండా గురువారం కందకాలు తవ్వించినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

గార్ల: పురుగుమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి పినిరెడ్డిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బానోత్ వంశీ గ్రామంలోని పల్లె పకృతివనంలో గడ్డిమందు తాగి వాంతులు చేసుకుంటుండగా, పక్కనే ధాన్యం కాంటాలు పెడుతున్న హమాలీ కార్మికులు చూశారు. ప్రేమ విఫలం అయినందునే గడ్డి మందు తాగినట్లు వంశీ తెలిపాడు. క్షతగాత్రుడిని హుటాహుటిన 108లో జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

కరపత్రాల ఆవిష్కరణ

కేసముద్రం: కేసముద్రంలో జనవరి 5న నిర్వహించనున్న ఏఐసీటీయూ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాల కరపత్రాలను గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంచ వెంకన్న, వేల్పుల వెంకన్న, వీరన్న, సాలయ్య, శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మహబూబాబాద్ రూరల్: అక్రమ అరెస్టులతో వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఆపలేరని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, సీఎం తీరుకు నిరసనగా మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి పిలుపు సందర్భంగా బుధవారం పిల్లి సుధాకర్, కుమార్, సాత్విక్, రవిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

రైలెక్కిన రక్షణ శాఖ వాహనాలు


మహబూబాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వ రక్షణ శాఖ, ఆర్మీ విభాగానికి సంబంధించిన పలు రకాల వాహనాలను ప్రత్యేక రైలులో తరలించారు. విజయవాడ వైపు నుంచి వరంగల్ వైపునకు రక్షణ శాఖ వాహనాలతో వెళ్తున్న ప్రత్యేక రైలు గురువారం మధ్యాహ్నం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ అప్‌లైన్‌లో కాసేపు ఆగగా ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.